# సాక్షి చిత్తూరు

శనివారం । 1 । జూలై । 2023






## శునకాలకు పరుగు పందెం

పెంపుడు శునకాలకు పరుగుం పందెం నిర్వహించిన నంఘటన శాంతిపురం మండలంలో వెలుగుచూసింది. - IIలో



## సదుంలో ఏనుగుల సంచారం

సదుం మండలంలో 14 ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు గుర్తించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. - IIలో

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 34 | 26 |
| తిరుపతి | 37 | 27 |
| తిరుమల | 32 | 22 |
| గూడూరు | 38 | 28 |
| నగరి | 36 | 27 |

## న్యూస్‌రీల్

### నేటి నుంచి రేషన్ పంపిణీ

**చిత్తూరు రూరల్:** జిల్లాలో శనివారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభించనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఈ నెలకు సంబంధించి ప్రభుత్వం1,339 చౌకదుకాణాల పరిధిలోని 5,31,019 కార్డులకు గాను 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యంతోపాటు, చక్కెర, కంది పప్పు, రాగులు పంపిణీ చేయనున్నామన్నారు. కార్డుదారులు రేషన్ పంపిణీ వాహనదారుల ద్వారా ఇంటి వద్దే సరుకులను పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

### కార్డుదారులకు గోధుమ పిండి

**చిత్తూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీలో సరుకులను పంపిణీ సంఖ్యను పెంచుతూ వస్తోంది. బియ్యం, చక్కెరతోపాటు కందిపప్పును అందిస్తూ వస్తోంది. ఈ నెల నుంచి రాగులు అందించాలని నిర్ణయం తీసుకుంది. అర్బన్ ప్రాంతాల్లో గోధుమ పిండి పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శనివారం నుంచి చిత్తూరు, పుంగనూరు, నగరి, పలమనేరు, కుప్పం అర్బన్ ప్రాంతాల్లో గోధుమ పిండి పంపిణీ చేయనున్నారు. ఇందుకు జిల్లాకు 94.05 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి సరఫరా అయింది. దీంతో 94,500 మంది కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది. ఒక్కొక్క కార్డుకు కిలో చొప్పున గోధుమపిండి అందించనున్నారు. ఇందుకు కార్డుదారులు రూ.16 చెల్లించుకోవాలని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు.

### బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

**చౌడేపల్లె:** పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ప్రతి శుక్రవారం రాహుకాల సమయంలో నిర్వహిస్తున్న రాహుకాల అభిషేక పూజలకు 32 జంటలు హాజరై పూజలు నిర్వహించినట్లు ఈఓ చంద్రమౌళి తెలిపారు. పూజా కార్యక్రమాలకు వీరు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో ముస్తాబు చేశారు. ఉభయదారులకు అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు.

### నేడు డీఎంహెచ్‌ఓ బాధ్యతల స్వీకరణ

**చిత్తూరు రూరల్:** చిత్తూరు జిల్లా డీఎంహెచ్‌ఓగా పార్వతీదేవి శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధికారులతో సమావేశం కానున్నారని తెలిపారు. నంద్యాల జిల్లాలో డీఐఓగా పనిచేస్తూ, బదిలీపై ఆమె జిల్లాకు వస్తున్నారని అధికారులు పేర్కొన్నారు.

### కళాకారులను ఆదుకోవాలి



జానపద కళాకారుల జిల్లా కార్యవర్గం

**పలమనేరు:** జిల్లాలోని జానపద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని జానపద కళాకారుల సంఘ రాష్ట్ర కార్యదర్శి బంగారు మురళి పేర్కొన్నారు. జిల్లాలోని 13 మండలాల కళాకారుల సంఘ గురువులు, 67మంది భజన బృందాలతో పలమనేరులోని ఓ కళ్యాణమండపంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలైన జానపదకళాకారులను ఆదుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఉందన్నారు. జానపద కళాకారుల సమస్యల పరిష్కారానికి జూలై 17న జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా సంఘ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘ సలహాదారుగా భువనేశ్వరి, అధ్యక్షులుగా రామచంద్రప్ప, కార్యదర్శిగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా పూల రవితో పాటు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోవడంతో భక్తులు శిలాతోరణం వరకు బారులు తీరారు. గురువారం అర్ధరాత్రి వరకు 62,005 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,127 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.75 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# నాణ్యం.. నిరంతరాయం

"వేసవిలోనూ కోతల్లేని విద్యుత్ అందిస్తున్నాం.. ఇచ్చిన మాట మేరకు వ్యవసాయానికి పగటి పూటే సరఫరా చేస్తున్నాం..
వినియోగం పెరిగినా అవసరాలకు తగ్గట్టు అందుబాటులోకి తీసుకువచ్చాం..
ప్రతిపక్షాలవి తప్పుడు ఆరోపణలని ప్రజలకు అర్థమయ్యేలా నాణ్యమైన కరెంట్ అందజేస్తున్నాం.. ఎల్లోమీడియా విషపురాతలతో వెనక్కులాగేందుకు యత్నించినా మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నాం..
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జిల్లా అభివృద్ధి పథంలో పయనించేలా పకడ్బందీగా కృషి చేస్తున్నాం" అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.

- డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్
- రైతులకు పగటిపూటే 9గంటల సరఫరా
- ప్రతిపక్షాలవి అసత్య ఆరోపణలు
- వంత పాడుతున్న ఎల్లోమీడియా
- జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో మంత్రి పెద్దిరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**తిరుచానూరు(చంద్రగిరి) :** ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుచానూరు సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ జూన్‌లో 260 మిలియన్ యూనిట్లతో అత్యధికస్థాయిలో వినియోగం పెరిగినా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డిమాండ్‌కు తగ్గట్లు విద్యుత్ అందించామని వెల్లడించారు. అయితే కొన్ని రాజకీయ పార్టీలు విద్యుత్ కోతలు విధిస్తున్నామని అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, వారికి ఎల్లోమీడియా తప్పుడు రాతలతో ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు.

**మూతపడిన ఫ్యాక్టరీలకు పూర్వవైభవం**

గతంలో కొందరు తమ స్వార్థ కోసం మూసివేసిన ఫ్యాక్టరీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్వవైభవం తీసుకువస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఈ నెల 4వ తేదీన చిత్తూరు జిల్లాలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చేతులమీదుగా విజయ డెయిరీని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.



భద్రతా వారోత్సవాలకు హాజరైన నేతలు, అధికారులు

అలాగే షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు రూ.32 కోట్ల వేతన బకాయిలు, విజయా డెయిరీకి రూ.12 కోట్లు బకాయిలను త్వరలోనే చెల్లించనున్నట్లు వివరించారు. అమూల్ సంస్థ రాకతో ఇప్పటికే పాడి రైతులకు లీటర్ పాలపై రూ.5 నుంచి రూ.10 అదనంగా వస్తోందన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు.

## సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారు



**సాక్షి, చిత్తూరు :** ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 4వ తేదీన చిత్తూరులో ఆయన పర్యటించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విజయా డెయిరీ వద్ద నూతనంగా ఏర్పాటు కానున్న అమూల్ డెయిరీకి శంకుస్థాపన చేయనున్నారు. చిత్తూరు పరిధిలోని చీలాపల్లి క్రిస్టియన్ మెడికల్ కళాశాల (సీఎంసీ) ఆవరణలో 300 పడకల ఆస్పత్రికి భూమి పూజ చేయనున్నారు. ఈనెల 4న సీఎం గన్నవరం నుంచి విమానంలో తిరుపతికి చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా చిత్తూరులోని మెసానికల్ మైదానానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంట వరకు కార్యక్రమాలను ముగించుకుని తిరిగి హెలికాప్టర్‌లో రేణిగుంటకు, అక్కడి నుంచి విమానంలో గన్నవరం వెళతారు. ఈ మేరకు సీఎం పర్యటనకు అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది.

**సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా...**

చిత్తూరులోని మెసానికల్ మైదానానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి చిత్తూరు డెయిరీ చేరుకుని, భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. 10.55గంటలకి పోలీస్ శిక్షణా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. 11.15 గంటలకు అమూల్ ప్రాజెక్టు ప్రారంభ సభలో పాల్గొంటారు. 12.55గంటలకు చీలాపల్లి సీఎంసీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు సీఎంసీ క్యాంపస్ భూమిపూజలో పాల్గొంటారు. 1.25గంటలకు సీఎంసీ ప్రాంగణంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరుతారు.

## 70 కళాశాలలకు నోటీసులు

**తిరుపతి ఎడ్యుకేషన్:** ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 70 జూనియర్ కళాశాలలకు ఇంటర్ బోర్డ్ షోకాజు నోటీసులను జారీ చేసినట్టు ఆర్‌ఐఓ రమేష్ తెలిపారు. తిరుపతి జిల్లాలో 40, చిత్తూరు జిల్లాలో 30 కళాశాలలకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## స్విమ్స్ డైరెక్టర్‌గా సదాభార్గవి



**తిరుపతి తుడా:** టీటీడీ జేఈవో సదాభార్గవి శుక్రవారం స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించారు. స్విమ్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంగమ్మ శుక్రవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో జేఈవో సదాభార్గవిని ఫుల్ అడిషనల్ చార్జ్ డైరెక్టర్, వీసీగా నియమితులయ్యారు. ఈ మేరకు టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో డాక్టర్ వెంగమ్మ నుంచి సదాభార్గవి బాధ్యతలు స్వీకరించారు.

## కండలేరులో చేపల వేట నిషేధం

**రాపూరు :** కండలేరు జలాశయంలో జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేటను నిషేధించినట్లు ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చేపలు గుడ్లు పెట్టే సమయం కాబట్టి నిషేధం విధించినట్లు వెల్లడించారు.

# నమ్మకం లేకనే దత్తపుత్రుడికి ప్యాకేజీలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**గంగాధరనెల్లూరు (కార్వేటినగరం) :** సొంత పుత్రుడిపై నమ్మకం లేకనే చంద్రబాబు దత్తపుత్రుడికి ప్యాకేజీలిచ్చి రోడ్లపై తిప్పి ప్రజలను రెచ్చగొడుతున్నారని ఉపముఖ్యమంత్రి కె నారాయణస్వామి విమర్శించారు. మండలంలోని అగరమంగళం గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత కులంలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని చెప్పిన ద్రోహి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. టీడీపీ పని అయిపోయిందని గమనించిన చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకొని అక్రమంగా సంపాదించిన సొమ్మును వెదజల్లి ప్రజలను నమ్మించేందుకు నానాతంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. లోకేష్ బాబు యాత్రలు హాస్యాస్పదంగా కొనసాగుతుండడంతో, వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని పవన్ కళ్యాణ్‌ను యాత్రకు పంపించారని చెప్పారు. ఇలాంటి కల్యాణ్‌లు ఎంతమంది వచ్చినా మరోసారి సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతుండడంతో అందరూ సంతృప్తికరంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీప్రియ దామోదర్, ఎంపీపీ అనిత, ఎంపీటీసీ ఇందిర, సర్పంచ్ సరోజ, కేశవరెడ్డి, గోవిందశెట్టి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ శివప్రకాష్ రాజు, జిల్లా మహిళ అధ్యక్షురాలు లీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జగనన్న సురక్ష ప్రారంభం



పుంగనూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు, పెద్దిరెడ్డి

**పుంగనూరు:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నెల రోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం పుంగనూరులో ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, కలెక్టర్ షణ్మోహన్‌తో హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మార్కెట్ కమిటీలో జరిగే సభాస్థలి ఏర్పాట్లను జేసీ, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలసి పరిశీలించారు. అనంతరం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తదితర నాయకులతో సమావేశంపై జాయింట్ కలెక్టర్ చర్చించారు. జేసీ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం కింద లబ్ధిదారులకు అందించే సేవల గురించి వివరించడం, సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు వివరించారు. పేదలకు రేషన్‌షాపుల ద్వారా గోధుమపిండి పంపిణీ చేస్తామన్నారు. రాగి పంటను ప్రోత్సహించేందుకు రాయితీపై రాగులు పంపిణీ చేస్తామన్నారు. దీనికి లబ్ధిదారులందరూ అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెంగారెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, రమణ, కౌన్సిలర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన అర్జున తపస్సు





తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి, తపస్సుమాను వద్ద వరపడిన మహిళలు

**కార్వేటినగరం:** కార్వేటినగరంలో వెలసిన శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు ఎంతగానో అలరించింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు గాజుల కండ్రిగ గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సు అందరినీ ఆకట్టుకుంది. అర్జున వేషధారి మెట్టు మెట్టుకూ పద్యాలు పాడుతూ తనతో తీసుకెళ్లిన నిమ్మకాయలు, విభూది, పుష్పాలను భక్తులపైకి విసురుతూ తపస్సుమాను అధిరోహించారు. మహిళలు తడిబట్టలతో సంతానప్రాప్తి కోసం వరపడ్డారు. ఈశ్వరునికోసం అర్జునుడు చేసిన తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లుగా భాగవతారిణి రెడ్డెమ్మ గాత్రకచ్చేరి నిర్వహించారు.

**ఆకట్టుకున్న ఆవుల మళ్లింపు**

కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి పురవీధుల్లో స్వామివారు ఊరేగారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం పట్టు వస్త్ర సుగంధ పుష్పాలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వన్నె రెడ్లు తీసుకొచ్చిన సారెతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. ఉత్తర గోగ్రహణంలో భాగంగా నకుల, సహదేవుల వేషధారులు ఆవుల మళ్లింపు ఘట్టాన్ని అద్భుతంగా ప్రదర్శించారు.

# కిలో మామిడికి రూ.12 ఇవ్వాల్సిందే

- ఉత్తర్వులు ఉల్లంఘిస్తే ఫ్యాక్టరీలు సీజ్ చేస్తాం
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా జూలై 1 నుంచి తోతాపురి మామిడి పండ్లకు కిలో రూ.12 తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మామిడి గిట్టుబాటు ధర అమలుపై విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మామిడికి రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా ఉంటోందన్నారు. మామిడి రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. చిత్తూరు జిల్లాలో పలమనేరు, బంగారుపాళ్యం, ఐరాల ఇతర ప్రాంతాల్లో ఎక్కువ మామిడి పంట సాగవుతోందన్నారు. జిల్లాలో పలమనేరు డివిజన్‌లో ఇప్పటి వరకు 45 నుంచి 50 శాతం మామిడి కోత పూర్తి అయిందని వివరించారు. సరిహద్దు ప్రాంతాల్లోనూ మామిడి కోత దాదాపు ముగిసి పోయిందన్నారు. ప్రస్తుతం జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి మామిడి కాయలు రావడం లేదన్నారు. జిల్లాలో ఉన్న మామిడి చివరి దశలో బాగా పక్వానికి వచ్చాయని వివరించారు. మామిడి రైతులకు అండగా ఉండేందుకు ఇప్పటికే రెండు సార్లు సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.25 లక్షల టన్నుల మామిడి కోత జరిగిందన్నారు. రైతులు, ఫ్యాక్టరీ యాజమాన్యాల సమక్షంలో మామిడి గిట్టుబాటు ధర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు**

జిల్లా వ్యాప్తంగా మామిడి గిట్టుబాటు ధర అమలు తీరు పట్ల పర్యవేక్షణకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిర్ణయించిన గిట్టుబాటు ధరను ఉల్లంఘిస్తే ఫ్యాక్టరీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతులు మామిడి పంటను ఎక్కడైనా అమ్ముకోవచ్చని, ఎక్కడ అమ్మినా రైతులకు కిలోకు రూ.12 గిట్టుబాటు ధరను ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. మామిడి రైతులకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే ఉద్యానవన శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం రైతులకు మేలు చేసేలా చర్యలు చేపడుతోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏడీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గంజాయి స్మగ్లర్ అరెస్ట్




నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**తిరుపతి క్రైం :** తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో సంచరిస్తున్న గంజాయి స్మగ్లర్‌ను గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టగా తమిళనాడుకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి వద్ద 30 కేజీల గంజాయి పట్టుబడినట్లు వెల్లడించారు. ఈ నెల 24వ తేదీన అనకాపల్లెలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి రైలులో తిరుపతి తీసుకువచ్చినట్లు నిందితుడు తెలిపాడని చెప్పారు. ప్రభాకర్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదైనట్లు తమ విచారణలో తేలిందని వివరించారు. అంతర్రాష్ట్ర స్మగ్లర్‌ను అరెస్ట్ చేసిన ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి, సిబ్బందిని అభినందించారు.

### వివాహిత ఆత్మహత్య

**చిత్తూరు అర్బన్:** నగరంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న చేతన్, భార్య సింధు(24)తో గొడవపడ్డాడు. దీంతో మనస్థాపం చెందిన సింధు ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాణ ప్రదాతలకు సలాం




వైద్యోనారాయణోహరి అన్నారు పెద్దలు.. అంటే వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. అందుకే వైద్యులమీద ఎన్ని విమర్శలు వచ్చినా, అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్యుల వద్దకే పరుగులు తీస్తుంటారు. అయితే కాసులకు కక్కుర్తి పడే వైద్యులు పదుల సంఖ్యలో ఉంటే, వృత్తిని దైవంగా భావించే వైద్యులు వేలల్లో ఉన్నారు. ఎంతో మందికి పునర్జన్మను ప్రసాదించారు. ధనిక, పేద తేడా లేకుండా సేవలు చేస్తున్నారు. నిరుత్సాహం నిండిన రోగులకు వ్యాధి నయం చేసి ధైర్యం నింపి చిరునవ్వుతో వెళ్లేలా చేస్తున్నారు. కరోనా మహమ్మారిలో ప్రాణాలకు తెగించి ఎంతోమందికి ఊపిరి పోశారు. డాక్టర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. – చిత్తూరు రూరల్

#### పుట్టిన ఊరే నేర్పింది



అటవీ ప్రాంతం.. అందులో కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న కుటుంబం. చిరు వ్యవసాయం చేసుకునే దంపతుల (డీటీ నాయక్, బాణిభాయ్) కష్టార్జితం.. ప్రభుత్వం సాయం తోడుగా నిలవడంతో స్టెతస్కోప్ అందుకున్నారు డాక్టర్ బీఎస్‌కే నాయక్. ప్రస్తుతం చిత్తూరు డీసీహెచ్‌ఎస్‌గా సేవలందిస్తున్నారు. ఈయనది పల్నాడు జిల్లాలోని కోసూరు మండలం పెరికపాడు అనే గిరిజన ప్రాంతం. చిన్నతనం నుంచి అక్కడి కష్టాల్లోనే పెరిగారు. ఆ కష్టాలు ఆయనకు పాఠాలు నేర్పించాయి. తెలుగుమాస్టర్ సహకారంతో పట్టువదలకుండా ప్రభుత్వ బడుల్లోనే చదువుకున్నారు. ఇంటర్ వరకు గిరిజన హాస్టల్లో ఉంటూ చదువుకున్నారు. 1990లో గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పట్టా అందుకున్నారు. తర్వాత 1995లో ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేసుకుని తొలిసారిగా విజయనగరం జిల్లాలోని కొమరాడ పీహెచ్‌సీఈలో బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న భార్య డాక్టర్ మాధవితో కలిసి కొన్నాళ్ల పాటు సొంత గ్రామంలో వైద్య సేవలు చేశారు. తర్వాత ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ఆప్రాంతంలో ఇప్పటికీ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ వస్తున్నారు. పుట్టిన ఊరే తనను ఈ వృత్తిని స్వీకరించేలా చేసిందని నాయక్ తెలిపారు.

#### పట్టుబట్టి సాధించారు.



ఈయన చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్. స్వగ్రామం హైదరాబాద్‌లోని భాగ్‌లింగంపల్లి. తల్లి దండ్రులు రాధ, పాచ్చయ్య. స్థానికంగా ఉన్న ప్రభుత్వ విద్యాలయాల్లోనే ఉన్నత చదువు పూర్తిచేశారు. తల్లి ప్రోత్సాహంతో 1985లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1988లో పీజీ పట్టా అందుకున్నారు. తొలిసారిగా 1989లో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల్లో చేరారు. 2000లో చిత్తూరు జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్య సేవలో మంచి గుర్తింపు పొందారు. ఇందుకుగాను ప్రభుత్వం ఆయనకు పలు అవార్డులు, ప్రసంశపత్రాలను అందించింది. చిన్నతనంలో డాక్టర్ కావాలనే పట్టుదల నాడిపట్టేలా చేసిందని, అప్పటి కుటుంబ, సమాజ పరిస్థితులే తనను డాక్టర్‌ను చేశాయని ఆయన పేర్కొన్నారు. సోదరి సుగుణ చిన్నపిల్లల వైద్య నిపుణులుగా పనిచేసి విరమణ పొందారు. భార్య మీనాకుమారి చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోనే అనస్థీషియాలజిస్టుగా పనిచేస్తున్నారు.

#### వైద్య ధర్మాన్ని పాటిస్తూ...



ప్రజలకు సేవ చేయాలన్న దృక్పథంతో ఈ వైద్య వృత్తికి వచ్చాం. వైద్య ధర్మాన్ని పాటిస్తున్నాం. పాటించాలి కూడా. వైద్య శిక్షణలో నేర్పిన అంశాలకు అనుగుణంగా పనిచేస్తున్నాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా పనిచేస్తున్నాం. చాలా మంది ఈ వృత్తిని తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు. అలా చేయకూడదని నామనవి.

-ఉషశ్రీ, గైనికలాజిస్ట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

#### వైద్య సేవ చేయడం గొప్ప వరం



ఆరోగ్యమే మహాభాగ్యమంటారు. మనిషికి ఎంత సంపద ఉన్నా దాన్ని అనుభవించే ఆరోగ్యం లేకపోతే అదంతా వృథాయే. అనారోగ్యంతో బాధపడే వారిని ప్రమాదస్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యులకే ఉంది. పవిత్రమైన ఈ వృత్తిలో రాణించడం గొప్ప వరంగా భావిస్తున్నాం. సేవ అనే నినాదంతో పనిచేస్తున్నాం.

-జానకీరావ్, కల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు

#### రైతు కుటుంబం నుంచి డాక్టరుగా ...



ఈయన వ్యవసాయ కుటుంబానికి చెందిన డాక్టర్ రవిరాజు. స్వగ్రామం కార్వేటినగరం ఆర్కేవీవీ పేట. ఈయన తల్లిదండ్రులు పూర్తిగా నిరాక్షరాస్యులు. అయినా ఈయన మాత్రం డాక్టర్ కావాలన్న లక్ష్యంతో పట్టువదలకుండా చదివారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని వైద్యవిద్యను పూర్తి చేశారు. కొన్నాళ్లు స్విమ్స్‌లో పనిచేసి ఆస్ట్రేలియా వెళ్లిపోయారు. కొంతకాలం తరువాత స్వదేశానికి తిరిగొచ్చారు. ఇక్కడ కార్వేటినగరం, పుత్తూరు పీహెచ్‌సీలో డాక్టరుగా పనిచేశారు. డీఐఓగా ఉంటూ, అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.




**బంగారం :**
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,380
**వెండి:**
హోల్‌సేల్ ధర (కిలో) రూ.71,000
రిటైల్ వెండి గ్రాము రూ.73.00

### పోక్సో కేసు నమోదు

**చిత్తూరు అర్బన్:** నగరంలోని ఓ బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనలో నిందితుడిపై పోక్సో (పిల్లలపై లైంగిక దాడి నివారణ చట్టం) కింద శుక్రవారం కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన 14 ఏళ్ల బాలిక కనిపించడంలేదంటూ ఆమె తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బాలికను లోకేష్ అనే వ్యక్తి అపహరించి, లైంగికదాడికి పాల్పడినట్లు గుర్తించారు. బాలికను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

### శునకాలకు పరుగు పందెం



పరుగు పందెంలో పాల్గొన్న కుక్కలు

**శాంతిపురం:** ఎడ్ల పందాల స్ఫూర్తితో యువకులు తమ పెంపుడు కుక్కలకు పరుగు పందేలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలంలోని చిన్నారిదొడ్డి పంచాయతీఎస్.గొల్లపల్లి వద్ద యువకులు శుక్రవారం కుక్కలకు పరుగు పందేలు జరిపి బహుమతులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన యువకులు వెరైటీగా ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఈ తతంగానికి తెరదీశారు. భైరవ పండుగ పేరుతో కుక్కల పరుగు పందేలకు రూపకల్పన చేసి గ్రామస్తుల వాట్సాప్ గ్రూపులో తమ ఆలోచనను షేర్ చేశారు. గ్రూపు సభ్యుల నుంచి దీనికి సానుకూల స్పందన రావడంతో కుక్కల పందేలు నిర్వహించారు. పంటలపై ఎండను నియంత్రించేందుకు వాడే షేడ్ నెట్లను ఇరువైపులా కట్టి గ్రామ సమీపంలోని పొలంలో బరిని సిద్ధం చేశారు. పోటీలో పాల్గొనేందుకు వచ్చే కుక్కలకు రూ.40 ఎంట్రీ ఫీజుగా నిర్ణయించారు. మొదటి బహుమతిగా రూ.200, 2వ బహుమతిగా రూ.150, 3వ బహుమతిగా రూ.140 నగదు ఇస్తామని ముందుకు వచ్చారు. గ్రామస్తులతో పాటు, సమీప గ్రామాల నుంచి ఔత్సాహికులు తమ కుక్కలతో వచ్చి పరుగు పందేలలో పాల్గొన్నారు.



### సదుంలో ఏనుగుల సంచారం

**సదుం:** మండలంలోని నడిగడ్డ పంచాయతీ పరిధిలో 14 ఏనుగుల గుంపు సంచరిస్తున్న విషయాన్ని రైతులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్‌బీఓ మహేష్ ఆధ్వర్యంలో ట్రాకర్స్, గ్రామస్తులు వాటిని జనావాసాల నుంచి అటవీ ప్రాంతానికి తరలి వెళ్లేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఏనుగుల గుంపు ఎర్రాతివారిపల్లె, పులికోన మధ్య ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

**రేణిగుంట :** మండలంలోని కరకంబాడి అమరరాజా పరిశ్రమ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపారు. మృతుడికి సుమారు 40–45 ఏళ్లు ఉంటాయని, మృతుని ఆచూకీ తెలియలేదన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## పారదర్శకంగా టెండర్ ప్రక్రియ

**చిత్తూరు అగ్రికల్చర్:** చిత్తూరు విజయా డెయిరీ ఆవరణలో శిథిలావస్థలో ఉండిన వస్తువుల టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా సహకారశాఖ అధికారి వనజ తెలిపారు. విజయా డెయిరీని 2002లో చంద్రబాబునాయుడు ఉద్దేశపూర్వకంగా మూయించారు. అప్పటివరకు డెయిరీలో వినియోగించిన ట్యాంకర్లు, యంత్రాలు, ఇతర సామగ్రిని అలాగే వదిలిపెట్టారు. అవన్నీ రెండు దశాబ్దాల పాటు వృథాగా ఉండడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం విజయా డెయిరీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విజయా డెయిరీ నిర్వహణ బాధ్యతను అమూల్ సంస్థకు అప్పగించింది. ఆ సంస్థ కొత్త యూనిట్ ఏర్పాటు చేసేందుకు జూలై 4న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియలో డెయిరీ ఆవరణలో శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్లు, సామగ్రిని ప్రభుత్వం రూ.1.14 కోట్లకు అంచనా వేసి విక్రయించేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకుగాను జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియను చేపట్టింది. ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు సీల్డు టెండరు ప్రక్రియను నిర్వహించింది. దీంతో 140 దరఖాస్తులను తీసుకెళ్లిన కాంట్రాక్టర్లు, అందులో 24 మంది టెండర్లు వేశారు. వారందరి సమక్షంలోనే 22వ తేదీ కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెరిచారని చెప్పారు. అందులో ప్రభుత్వ ధర కన్నా అదనంగా రూ.1.4 కోట్లకు టెండరు కోడ్ చేసిన ఎంఆర్ మెటల్ ఫరం యజమాని అజ్గర్‌కు టెండరును ప్రకటించినట్లు వివరించారు. ఈ ప్రక్రియను వీడియో తీసి పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

### చిత్తూరులో యువతి అదృశ్యం

**చిత్తూరు అర్బన్:** కళాశాలకు వెళ్లిన యువతి కనిపించడంలేదంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రంకు చెందిన మమత (19) నగరంలోని డిగ్రీ కళాశాలలో చదువుకుంటోంది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన యువతి, సాయంత్రం ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు యువతికి ఫోన్ చేస్తే సెల్ స్విచ్ ఆఫ్ అయ్యింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.